క్లుప్తంగా

పేదల ఆప్తుడు రామయ్య


రామయ్య(ఫైల్)

బ్రహ్మంగారిమఠం : పేదల ఆప్తుడు రామయ్య అని, ఆయన లేని లోటు తీర్చలేనిదని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మైదుకూరు నియోజకవర్గం సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్ యాదవ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ సోమిరెడ్డిపల్లె (బీ.మఠం) సర్పంచ్ రామయ్య(70) మంగళవారం బెంగుళూరులో మృతి చెందారు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రెండు రోజుల క్రితం తన కుమారుడి దగ్గరకు వెళ్లిన ఆయన తుదిశ్వాస విడిచారు. నరసన్నపల్లె ఎస్సీ కాలనీలో జన్మించిన రామయ్య ఆర్మీలో పనిచేశారు. అనంతరం రాజకీయాల్లో రాణించారు. రామయ్య సర్పంచ్ అయిన తరువాత పంచాయతీలోని పలు గ్రామాల్లో ఎవరైనా ఎస్సీలు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.5వేలు చొప్పున సాయం చేసేవారు. ఆయన భార్య, మరో కుమారుడు కరోనాతో ఒకేరోజు చనిపోయారు.

సగరులకు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలి


సగర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : సగర కులస్తులకు రాబోయే ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు మురళీ పేర్కొన్నారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్లోని సగర సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సగర కులస్తులు 25లక్షల మంది ఉన్నారని దామాషా ప్రకారం అన్ని పార్టీలు సీటు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.రామకృష్ణ, రాష్ట్ర సగర సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షుడు పంజగల మురళీ, నాయకులు కొత్తపల్లి నరసింహ, కేశవ్, లక్ష్మీనారాయణ, కొండయ్య, హరి, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

గోపవరం : మండలంలోని ప్రజలు సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం మకర సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కనబరిచారు. మంగళవారం కనుమ పండుగ సందర్భంగా పశువులను పూజించారు. పండుగ మూడు రోజుల పాటు పల్లెల్లో సందడి నెలకొంది. ఇళ్ల ముంగిళ్లు రంగ వల్లులతో కళకళలాడాయి.

అంగన్‌వాడీల నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె మంగళవారం 36వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీలు సంక్రాంతి పండుగను బంధువులతో గడపకుండా వారి సమస్యలపై పోరాడుతున్నారన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెన్‌ఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, సునీత, కృష్ణవేణి, పద్మ, సుబ్బలక్షుమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

– ట్రాఫిక్ సీఐ యుగంధర్


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ యుగంధర్

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని ట్రాఫిక్ సీఐ యుగంధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో నిర్దేశించిన ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులను నిలపాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ బస్సులను ఆపడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ సమస్య తగ్గించడానికి డ్రైవర్లు సహకరించాలని కోరారు. డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీని ప్రమాద రహిత సంస్థగా నిలపడంలో డ్రైవర్లు ప్రధాన పాత్రను పోషించాలని చెప్పారు. వేగం కన్నా ప్రాణం మిన్న అనే ప్రధాన సూత్రాన్ని ఎవరూ విస్మరించరాదని ఆయన తెలిపారు.

ఘనంగా పార్వేట ఉత్సవం

అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



తలపాగా అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరుడు, రామేశ్వరం పెన్నానది ఒడ్డున పార్వేట ఉత్సవంలో రామలింగేశ్వరస్వామి, హనుమత్ లింగేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరస్వామి, హనుమత్‌లింగేశ్వరస్వామి ఆలయాల్లో కనుమ పండుగ సందర్భంగా పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంగా రాజరాజేశ్వరిదేవి సమేత ముక్తి రామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను, గంగా అన్నపూర్ణేశ్వరి సమేత హనుమత్ లింగేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలపై ఆశీనులను చేశారు. ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా పెన్నానది ఒడ్డుకు పార్వేట ఉత్సవం తీసుకెళ్లారు. అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బొల్లవరంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం పార్వేట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవిభూదేవి సమేత ప్రసన్నవేంకటేశ్వరస్వామికి విశేష పూజా కార్యక్రమాలు చేసి మూలవిరాట్‌లను నూతన పట్టు వస్త్రాలతో, వెండి కవచాలతో, పూలదండలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా రైతువలే తలపాగాతో తీర్చిదిద్దారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా రూపొందించిన వాహనంపై ఆశీనులను చేసి ఆలయ సమీపంలోని మైదానంలో పార్వేట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుందేలును వైఎస్సార్ సీపీ నాయకుడు పోరెడ్డి నరసింహారెడ్డి కుందేలును వదిలారు. పార్వేట ఉత్సవాన్ని తిలకించేందుకు బొల్లవరంతోపాటు పట్టణం, పరిసర గ్రామాల ప్రజలు చేరుకోవడంతో ఆ ప్రాంతం ప్రజలతో కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకరరెడ్డి, చలపతి, చాడా రామకృష్ణారెడ్డి, మురళీ, ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, బొల్లవరం గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధి నరసింహాపురంలోని లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో స్వామి,అమ్మవార్లకు పార్వేట ఉత్సవాన్ని సమీపంలోని పెన్ననదిలో నిర్వహించారు.

కనుల పండుగగా గ్రామోత్సవం

రాజుపాళెం : కనుమను పురస్కరించుకొని మండలంలోని టంగుటూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం గామోత్సవం, పార్వేట మహోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. సోమేశ్వరస్వామి ఆలయంలో నంది వాహనంపై సోమేశ్వరస్వామి, వీరభద్ర స్వామి, పార్వతీదేవి, అలాగే మదనగోపాల స్వామి ఆలయంలో రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు కుల మతాలకు అతీతంగా పెద్ద ఎత్తున మహిళలు, పిల్లలు, యువకులు, బంధువులు, స్నేహితులు తరలివచ్చారు. తెనాలి వారిచే కాంతార కార్యక్రమం, ప్రొద్దుటూరు వారిచే కోలాటం అందరిని అలరించాయి.

అట్లూరు : సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఊరూరా గొబ్బెమ్మలు నెలకొన్నాయి. మహిళలు, యువతులు ఇంటింటికి వెళ్లి గొబ్బెమ్మల పాటలు పాడుకుంటూ వీధుల వెంబడి కలియతిరిగారు. రాత్రికి భక్తిశ్రద్ధలతో బాణాసంచా పేల్చుతూ డప్పువాద్యాలతో రంగులు చల్లుకుంటూ ఆయా గ్రామాల సమీపంలో ఉన్న నీటి కొలనులలో గొబ్బెమ్మలను వదిలారు.

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లె, గొంటువారిపల్లె గ్రామాల్లో మంగళవారం కనుమ పండుగ సందర్భంగా చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. కొంతమంది చౌడేశ్వరిదేవి భక్తులు అమ్మవారికి కానుకలు సమర్పించుకున్నారు. నరసాపురంలో సీతారామలక్ష్మణ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. అలాగే సావిశెట్టిపల్లెలో కనుమ పండుగను పురస్కరించుకుని గ్రామస్తులు కోలాటం నిర్వహించారు. ఈ కోలాటంలో జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో సీతారామ లక్ష్మణ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు.

కలసపాడు : మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఎగువ రామాపురంలో యువకుల ఆధ్వర్యంలో కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కబడ్డీలో తంబళ్లపల్లె జట్టు మొదటి స్థానంలో నిలువగా వారికి రూ.14,500లు బాసిరెడ్డిశివారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రెండవ స్థానంలో ప్రకాశం జిల్లా గడిగోట జట్టు గెలువగా వారికి రూ.6,500లు ఎగువ రామాపురంకు చెందిన బండిప్రతాప్‌రెడ్డిలు అందజేశారు. అలాగే ఎగువ రామాపురంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి రూ.5 వేలు, రెండవ బహుమతి రూ.2500లు, మూడవ బహుమతి రూ.1000ను విజేతలకు అందజేశారు.

బద్వేలు అర్బన్ : పాడిపంటలు అభివృద్ధి చెంది ప్రజలంతా సుఖసంతోషాలతో మెలగాలని స్థానిక విద్యానగర్‌లోని మహిళలు ప్రతియేటా మాదిరిగానే ఈ యేడు కూడా సంక్రాంతి సందర్భంగా గొబ్బెమ్మల పండుగ నిర్వహించారు. మంగళవారం గొబ్బెమ్మలను ఊరేగించారు. ఈ ఊరేగింపు వెంట మహిళలంతా రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా ముందుకు సాగారు. అనంతరం గొబ్బెమ్మలను సగిలేరులో నిమజ్జనం చేశారు.

మైదుకూరు : సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మైదుకూరులో మంగళవారం శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి పార్వేట ఉత్సవం కనుల పండువగా జరిగింది. లక్ష్మీ మాధవరాయస్వామి ఆలయంలో కనుమ పండుగ సందర్భంగా ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్వ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. మధ్యాహ్నం 3 గంటల నుండి ప్రత్యేకంగా అలంకరించిన పూలరథంపై ఉత్సవవిగ్రహాలను కొలువుదీర్చి పార్వేట ఉత్సవాన్ని జరిపారు. కేరళ డ్రమ్స్, చెక్కభజన, కోలాటం, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్వామి వారి పార్వేట ఉత్సవాన్ని దర్శించేందుకు పరిసర గ్రామాల ప్రజలు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పార్వేట ఉత్సవాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దర్శించుకున్నారు.

చాపాడు : మండల వ్యాప్తంగా గత మూడు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి పండుగ వేడుకలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. మండలంలోని వెదురూరులోని సంగమేశ్వర స్వామి సన్నిధిలో పార్వతి దేవి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని చియ్యపాడు గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి సన్నిధిలో సోమవారం రాత్రి మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇదే క్రమంలో మండలంలోని అల్లాడుపల్లె, పల్లవోలు, సిద్దారెడ్డిపల్లె, రాజుపాళెం గ్రామాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహించటంతో పాటు పలు రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గ్రామోత్సవ వేడుకలు ఘనంగా జరిపారు.

దువ్వూరు : పాత దువ్వూరు శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కనుమ పండుగ సందర్భంగా పార్వేట ఉత్సవాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కొత్రపాటి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకంగా ఆలయ అర్చకుడు శ్రీధర్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. సీతా సమేత కోదండరామస్వామి, లక్ష్మణ, హనుమంతుడి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంపై ఆశీనులు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కానాల ఓబులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిరాకి బాషా, ఇరగంరెడ్డి గోపాల్‌రెడ్డి, జొన్నవరం వీరారెడ్డి, పెంచికలపాటి రమణయ్యానాయుడు, మంచాల రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. వెల్లాల పార్వేట మహోత్సవం


స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లో మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం పార్వేట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈఓ బీవీ నరసయ్య, ఆలయ మాజీ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. హనుమత్ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను, నంది వాహనంపై గంగాదేవి పార్వతీ సమేత భీమలింగేశ్వర స్వాములను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు చేశారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామోత్సవం అంబరాన్నంటింది. వెల్లాల గ్రామం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు గోపాయపల్లె, నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం మల్లెవేముల, దద్దనాల, పగిడాల, కుమ్మరపల్లె, పర్లపాడు గ్రామాల మీదుగా సాగింది. ఆ గ్రామాల్లో ప్రొద్దుటూరుకు చెందిన నందీశ్వర చెక్కభజన కళాకారుల బృందం చేసిన నృత్యం, పాటలు అందరిని అలరించాయి.

ఉత్సవ విగ్రహాలకు ఘన స్వాగతం

గోపాయపల్లెకు ఉత్సవ విగ్రహాలు రాగానే జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, సర్పంచ్ జీరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పెద్దసంఖ్యలో మహిళలు, ప్రజలు భజన పాటలు పాడుకుంటూ ఘన స్వాగతం పలికారు. విగ్రహాలు ఇంటివద్దకు రాగానే జెడ్పీటీసీ సభ్యురాలు, ఆలయ మాజీ చైర్మన్ పట్టాబి సీతారామిరెడ్డి, సర్పంచ్ గోవర్ధనరెడ్డి, సర్పంచ్ కానాల రాధ పూజలు చేశారు.


రాజుపాళెం : టంగుటూరులో కోలాటం వేస్తున్న కళాకారులు


అట్లూరు : సోమేశ్వరపురంలో గొబ్బెమ్మకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు


కాశినాయన : ఆకులనారాయణపల్లెలో చౌడేశ్వరిదేవి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


బద్వేలు : విద్యానగర్‌లో గొబ్బెమ్మలను ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు


చాపాడు : పల్లవోలు సీతారాముల గ్రామోత్సవ వేడుకల్లో గ్రామస్తులు


దువ్వూరు : ప్రత్యేక అలంకరణలో శ్రీకోదండరామస్వామి


దువ్వూరు : పార్వేట ఉత్సవంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి



రాజుపాళెం : టంగుటూరులో సోమేశ్వరస్వామి, మదనగోపాల స్వామి పల్లకీ ఊరేగింపు

నేడు మేలుకో బీసీ చర్చా వేదిక


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు మేలుకో బీసీ ప్రజాతంత్ర చర్చా వేదిక నిర్వహిచనున్నట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెన్నా సరళాదేవి తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మేలుకో బీసీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభాలో అధిక శాతం బీసీలు ఉన్నా రాజ్యాధికారం సంపాదించుకోలేక పోతున్నామన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్ప సంక్షేమానికి కృషిచేయడం లేదన్నారు. అన్ని రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికల్లో బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. మేలుకో బీసీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు తదితరులు పాల్గొంటారన్నారు. అన్ని బీసీ కులాల నాయకులు, ప్రతినిధులు పాల్గొని తమ సూచనలు, సలహాలను ఇవ్వాలని కోరారు. బీసీ నాయకులు పాణ్యం సుబ్బరాయుడు, సందు శివనారాయణ, శ్రీనివాసాచారి, కృష్ణయ్యయాదవ్, రామకృష్ణ, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన


జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కవితతో పూర్వపు విద్యార్థులు

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం పాఠశాల పూర్వపు విద్యార్థులు నాడు–నేడు ఫేజ్-1 పనులు పూర్తయిన సందర్భంగా సందర్శించి హర్షం వ్యక్తం చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు పి.జె.పి.కవిత తెలిపారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ మేము చదువుకునే రోజుల్లో ఇలాంటి మౌలిక వసతులు లేవని, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం హర్షణీయమని, ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధునిక మరుగుదొడ్లు, ట్యాబ్‌లు, రక్తహీనతకు ఐరన్ ట్యాబెట్లు, జగనన్న గోరుముద్దలో గుడ్లు, రాగిజావ, చిక్కీ వంటి విద్యార్థులకు అందిస్తున్నారని, అలాగే జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు, బూట్లు అందజేస్తున్నారని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం


వైద్యవిద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న బండారు సూర్యనారాయణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో శ్రీ చౌడేశ్వరిదేవి తొగటవీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.శ్రీలీనా అనే వైద్య విద్యార్థినికి హాస్టల్ ఫీజుకు గాను రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఉన్న పేద తొగటవిద్యార్థులకు సంఘం తరపున చేయూత అందిస్తామని తెలిపారు. లీనా బాగా చదువుకుని పేద ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉమ్మడి శెట్టి చౌడయ్య, మోతుకూరు సుబ్బయ్య, రామయ్య, ఉపాధ్యాయులు తులసీ ఈశ్వరయ్య, సుబ్బయ్య, గాలి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి క్రికెట్ పోటీలు

మైదుకూరు : పట్టణంలో గణేష్ రాయల్స్ (ఎంసీసీ) ఆధ్వర్యంలో రాయలసీమ స్థాయి హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను నిర్వహించనున్నారు. ఈనెల 19 నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీల్లో పాల్గొనే జట్లు 17వ తేదీలోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతకు మొదటి బహుమతి రూ.50వేలు, రన్నరప్‌కు రూ.30వేలు నగదు అందజేస్తామని వారు పేర్కొన్నారు. వివరాలకు 98850 53115, 98850 68818, 98858 62682 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ఎస్సీ కమిషనర్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌కు వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన్ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణకు దళిత సోదరులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె. బాబు, శ్యాంసన్, జ్యోతి, బండి రమణ, పి. శివ, సీహెచ్ సునీల్, లక్ష్మీనారాయణ, శరత్ బాబు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సత్కారం : జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పస్తం అంజి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అజయ్‌కుమార్, రమేష్ బాబు, కిరణ్, సుధీర్, సునీల్ పాల్గొన్నారు.

చెస్‌లో కడప క్రీడాకారుల ప్రతిభ

కడప స్పోర్ట్స్ : బెంగళూరు రూరల్ డిస్ట్రిక్ట్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 15వ బీఆర్‌డీసీఏ చెస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన క్రీడాకారులు బహుమతులు సాధించారు. ఈనెల 11వ తేదీన నిర్వహించిన ఆన్‌లైన్ ఓపన్ చెస్ పోటీల్లో 50 ప్లస్ విభాగంలో అనీస్‌దర్బారీ 6 పాయింట్లతో రెండోస్థానం, అండర్-15 బాలికల విభాగంలో లాస్యశ్రీ మూడోస్థానంలో నిలిచారు. వీరితో పాటు అండర్-11 బాలికల విభాగంలో లక్ష్మీమనుశ్రీ మూడో స్థానం, అండర్-9 బాలికల విభాగంలో అమీనా 5వ స్థానంలో నిలిచినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు.

చర్చి నిర్మాణానికి ఎంపీ సహకారం


నగదును అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : కూనవారిపల్లె హరిజనవాడలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఖాజీపేట మండలం కూనవారిపల్లె పంచాయతీలోని హరిజనవాడలో నూతనంగా చర్చి నిర్మిస్తున్నారు. చర్చి నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విషయాన్ని అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డిలు ఎంపీ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన చర్చి నిర్మాణానికి రూ.2 లక్షలను ప్రకటించారు. మంగళవారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతులమీదుగా నగదును చర్చి నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 19న సీఎం జగన్ చేతుల మీదుగా అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు. అందుకు బస్సును ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. విగ్రహ ఆవిష్కరణలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ భూమన సుబ్బారెడ్డితోపాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు బి.మఠంకు ఎమ్మెల్యే, డీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ రాక

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించిన సహకార పరపతి సంఘం భవన ప్రాంభోత్సవానికి బుధవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, డీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీలు వస్తున్నట్లు సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, పరపతి సంఘం సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రావాలని కోరారు.

భారీగా అన్నదానం


భోజనం వడ్డిస్తున్న రమేష్‌యాదవ్ తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాముల పేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ కార్యకర్తలు, మిత్రులు, అభిమానుల మధ్య ఎమ్మెల్సీ కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. యాదవ సంఘం, బీసీ నాయకులు, పురప్రముఖులు ఎమ్మెల్సీకి పూలమాల వేసి, శాలువ కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద 3000 మందికి అల్పాహారం, కొనిరెడ్డి ఫౌండేషన్ కార్యాలయంలో 1000 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ సలహాదారు అంబటి కృష్ణారెడ్డి కౌన్సిలర్‌లు మురళీధర్ రెడ్డి, ఇర్ఫాన్, మునీర్, ఎమ్మెల్సీ సోదరుడు ఆర్వి.ప్రసాద్, గురవయ్య, చిలకల కృష్ణారెడ్డి, దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

బ్రహ్మంగారిమఠం : సంక్రాంతి సందర్భంగా మండలంలోని ప్రజలు మూడు రోజులపాటు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి రోజు సోమవారం రాత్రి పలుగ్రామాల్లో సీతారాముల గ్రామోత్సవాలు నిర్వహించారు. కనుమ రోజు మంగళవారం సాయంత్రం ఎడ్ల పోటీలు, పార్వేటలు, డీజేలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా బి.మఠం పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ కుటుంబ సమేతంగా స్వగ్రామమైన రేకలకుంటలోని లక్ష్మిబాలాజీ నగర్, రేకలకుంటలలో పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.